క్లుప్తంగా

ప్రజారోగ్యానికి పెద్దపీట

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం లావణ్య మాట్లాడుతూ.. కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాల్లో పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారిని గుర్తించి పలు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్దన్‌చారి, శ్రావణ్, లక్ష్మయ్య, ప్రవీణ్, కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



గొర్రెలకు టీకాలు వేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: జీవాలకు సీజనల్ వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తుగా చర్యలు తీసుకుంటుందని రేగడిద్దోసాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మద్దూరు, కుమ్మరిగూడ, అంతారం గ్రామాల్లో చిట్టుక వ్యాధి నివారణ టీకాలు వేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధులపై కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రైతు టీకాలను విధిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

లక్ష్మీనారాయణకు సన్మానం



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నర్సింలు

కేశంపేట: మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన పాపిరెడ్డిగూడకు చెందిన లక్ష్మీనారాయణను గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పద్మశాలిల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సభ్యత్వ నమోదు అనంతరం గ్రామాల్లో నూతనంగా కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పద్మశాలిలు ఉద్యోగ, వ్యాపార రంగాలతో పాటు రాజకీయంగా ఎదగాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నర్సింలు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొందుర్గు: భారత రాజ్యాంగ గ్రంథాన్ని పౌరులందరికీ ఉచితంగా ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ కొందుర్గు మండల కమిటీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని నడిపిస్తున్నది రాజ్యాంగమని అలాంటి రాజ్యాంగం పట్ల 90 శాతం జనాభాకు అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రతి పౌరుడికి రాజ్యాంగం అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, పెంటయ్య, శ్రీనివాసు, గోపాల్, మల్లేష్, అశోక్, అనిల్, గణేశ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొందుర్గు: మండలంలోని శ్రీరంగాపూర్ గ్రామంలో పోచమ్మ దేవాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి లక్ష రూపాయాల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనను ప్రతిఒక్కరూ అలవచ్చుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్‌రెడ్డి, సయ్యద్ సాదిక్, జంగయ్య, రవీందర్‌యాదవ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు

షాద్‌నగర్: క్రీడాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సీఎం కప్ క్రీడల్లో జిల్లాస్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఫరూఖ్‌నగర్ వాలీబాల్ జట్టు సభ్యులను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలోని క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పేరిట క్రీడలను నిర్వహిస్తుందన్నారు. క్రీడలతో శరీరం దృఢంగా తయారవడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. సీఎం కప్ పోటీల్లో ఫరూఖ్‌నగర్ క్రీడాకారులు సత్తా చాటి రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి క్రీడాకారులకు ఐదువేల నగదు బహుమతిని అందజేశారు. అనంతరం క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంఈఓ శంకర్ రాథోడ్, సర్వర్‌పాషా, శ్రీనివాస్‌గౌడ్, అద్దు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

కొత్తూరు: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన శుక్రవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెట్టుబడులు రావాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా ఆ ప్రాంతంలో ఉన్న శాంతిభద్రతలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసుశాఖ క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో ఎంతో ముందుందన్నారు. దీని ఆధారంగానే రాష్ట్రంలోని పలుచోట్ల కార్పొరేట్, ఇతర సంస్థలు తమ వ్యాపార లావాదేవీలను కొనసాగించడానికి ముందుకొచ్చినట్లు వివరించారు. కెమెరాల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో చోటు చేసుకునే నేరాలను త్వరగా పోలీసులు ఛేదించే అవకాశం ఉందన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇచ్చిన దాతలను సత్కరించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ భాస్కర్, కొత్తూరు సీఐ బాలరాజు, ఎస్ఐ శంకర్, నాయకులు ఈట గణేశ్, ఎమ్మె సత్యనారాయణ, దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, మెండెకృష్ణ, దాతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు

కొందుర్గు: ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఉమ్మెంత్యాలలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, వెంకిర్యాలలో దళితబంధు పథకం ద్వారా నిర్మించిన పౌల్ట్రీఫామ్‌ను ప్రారంభించారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తుందన్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు రామకృష్ణ, రాజారమేశ్‌రెడ్డి, యాదయ్య, సుందర్ పాల్గొన్నారు.

కంటి వెలుగు లక్ష్యాన్ని పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

- అర్హులైన ప్రతిఒక్కరికి కంటి పరీక్షలు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దృష్టి సమస్యలతో బాధపడుతున్న పేదల కోసం ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు అందజేయడంతో జరుగుతుందన్నారు. డివిజన్ పరిధిలో 10 కంటివెలుగు టీంలు ప్రతిరోజు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. షాద్‌నగర్ పరిధిలో 92శాతం మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, వచ్చే జూన్ నాటికి ప్రభుత్వం నిర్ణయించిన 100శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. అర్హులైన ప్రతిఒక్కరు కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారు లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

కొందుర్గు: మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కల్గి ఉండాలని ప్రజ్వల సంస్థ సీనియర్ మేనేజర్ బలరామ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశం ఏర్పాటు చేసి అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్, పోలీసు శాఖల సమన్వయంతో గత 27 సంవత్సరాలుగా 27 వేల మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. నేటి యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్యాపింగ్‌కు గురై మోసపోతున్నారని వాపోయారు. ఈ విషయమై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రామస్వామి, ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు, వీఓఏలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

షాద్‌నగర్‌రూరల్: దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని శుక్రవారం పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కాకునూరుకు చెందిన గోపనిభీమయ్యకు అదే గ్రామానికి చెందిన అగ్రకులం వారికి బొడ్రాయి పండుగ సమయంలో వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదాన్ని మనస్సులో పెట్టుకొని గ్రామానికి చెందిన మహాలింగం, బద్రి, శివకుమార్, కుమార్ గోపని భీమయ్యపై దాడి చేశారని ఆరోపించారు. గ్రామపంచాయతీ వరకు లాక్కెళ్లి దాడి చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన, దాడికి కుట్ర పన్నిన సూత్రదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కేశంపేట: మండలంలోని లేమామిడి పరిధిలోని నానుతండాకు చెందిన చెంద్యానాయక్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఎన్ఆర్ఐ గోగు వెంకట్ నారాయణరెడ్డి రూ.10వేలు, స్త్రీశిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల రూ.5వేలు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్ రూ. 5వేలు, సర్పంచ్ శ్రీశైలంగౌడ్ రూ.5వేలు, మధుసూదన్‌రెడ్డి రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే, మండలంలోని లింగంధనలో చెన్నయ్య శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్పర్సన్ విశాల, లక్ష్మీనారాయణగౌడ్‌లు ఐదువేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌గుప్త, మధుసూదన్‌గౌడ్, వెంకట్, మణికంఠ, కృష్ణ పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. చిన్నారికి అస్వస్థత



కాలపరిమితి ముగిసిన గ్లూకోజ్

శంకర్‌పల్లి: ఏడాది క్రితం కాలపరిమితి ముగిసిన సెలైన్ (గ్లూకోజ్)ను బాలికకు ఎక్కించడంతో అస్వస్థతకు గురైంది. ఈ ఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా , పరిగి మండలానికి చెందిన సృజన(14)కి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చేర్పించారు. శుక్రవారం బాలికకు కాలం చెల్లిన సెలైన్ ఎక్కించడంతో ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు సెలైన్‌ను పరిశీలించారు. మే 2022 నాటికి ముగిసిన సెలైన్‌గా గుర్తించారు. ఈ కారణంగానే బాలిక అస్వస్థకు గురైందని, ఆస్పత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ విజయ్ తప్పును గుర్తించి బాలికను సంగారెడ్డిలోని సన్‌రైజ్ ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ



విలేకరులతో మాట్లాడుతున్న శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియాగాంధీ అని గర్వంగా చెప్పుకోవాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అవతరణ వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రం కోసం 12 వందల మంది యువకులు బలిదానం చేసుకున్నందుకు చలించిన సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రస్తుతం డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసి ఉద్యోగ, ఉపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు, నాయకులు శశిధర్, గిరిధర్, రజిత, లక్ష్మీసుధ, నర్సింలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యసహకార సంఘం చేగూరు అధ్యక్షుడిగా రవి

నందిగామ: మండలంలోని చేగూరులో శుక్రవారం నిర్వహించిన మత్స్య సహకార సంఘం అధ్యక్ష , కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి టీసీ నర్సింహారావు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడితో పాటు 8 మంది సభ్యులకు గాను ఒక్కొక్క నామినేషన్ దాఖలు అయ్యిందని, దీంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన చెప్పారు. అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, కార్యదర్శిగా శ్రీను, కార్యవర్గ సభ్యులుగా రాజు, బాల్‌రాజ్, అంజయ్య, జంగయ్య, బాల్‌రాజ్‌లు ఎన్నికైనట్లు చెప్పారు. నూతన కమిటీని మత్స్యకారులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, ముదిరాజ్‌లు కృష్ణయ్య, రాజు,శ్రీశైలం పాల్గొన్నారు.

కంటి వెలుగుతో లబ్ధి

ఎంపీపీ ప్రియాంక



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రియాంక, సర్పంచ్ తదితరులు

నందిగామ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండలంలోని నర్సప్పగూడలో సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు కంటి సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో కంటి వెలుగును ప్రారంభించారని వివరించారు. గ్రామ గ్రామాన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, కంటి సమస్యతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్సలు నిర్వహిస్తారని, మందులను, కంటి అద్దాలను సైతం అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ కళమ్మ, గ్రామ కార్యదర్శి జానకీరాం, వార్డు సభ్యులు సత్యం, కృష్ణ, గ్రామస్తులు జంగిలి కుమార్, గోవిందు శేఖర్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీభూపాల్, యాదగిరి, నర్సింహా, అంగన్‌వాడీ టీచర్ శోభ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రతీ పల్లె అభివృద్ధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ పాలనలో ప్రతి పల్లె అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మాసానిగూడ, అనుబంధ గ్రామాలైన కచ్చిరెడ్డిగూడ, మంచర్లగూడలో శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లెల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ సమస్యలు లేకుండా చేయడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీల బలోపేతంతో పాటు ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను అందించడం జరిగిందన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే, అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ గోవిందమ్మ, గ్రామ సర్పంచ్ రాములు, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మాజీ సర్పంచ్ సత్యయ్య, నాయకులు గోపాల్, గోవర్ధన్‌రెడ్డి, శంకరయ్య, ప్రభుగౌడ్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యం



మహేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఇబ్రహీం

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం

షాద్‌నగర్: రాజన్న రాజ్యం నిర్మాణంతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌టీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందుర్గు మండల పార్టీ కన్వీనర్‌గా మహేందర్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహానేత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో పథకాలు రూపొందించి అమలు చేశారని చెప్పారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా వైఎస్ షర్మిల పార్టీని స్థాపించి నిరుపేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాటం చేస్తుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తేనే పార్టీకి, నాయకులకు ఆదరణ పెరుగుతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మ, సుదర్శన్, రామచంద్రయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



సర్పంచ్‌లకు ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: మండలంలోని అన్ని గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సర్పంచ్‌లకు సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధుల నుంచి మండలానికి మంజూరైన రూ.2 కోట్ల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడులేని విధంగా మండలానికి కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని అన్నారు. ఫలితంగా అంతర్గత మురుగు కాలువలు, సీసీరోడ్లు, మంచి నీటి సదుపాయాలు, చెరువుల మరమ్మతులు చేశామని వివరించారు. గ్రామాల్లో సమస్యలను ఎమ్మెల్యే కాలె యాదయ్య శుభోదయం కార్యక్రమాల ద్వారా తెలుసుకొని నిధులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం వైస్‌చైర్మన్ మల్లేశ్, సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, దర్శన్, చంద్రశేఖర్, శేఖర్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, నర్సింహులు, మునీర్, గోపాల్, రాంచంద్రారెడ్డి, దేవేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

కరెంటు సమస్యను పరిష్కరించండి



విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో గత 20 రోజుల నుంచి కరెంటు సమస్య ఉందని లైన్‌మెన్, సిబ్బందికి తెలిపిన పట్టించుకోవడం లేదని సర్పంచ్ మంజుల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి శుక్రవారం మండల విద్యుత్ అధికారి హమునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కరెంటు వస్తూ పోతుందని , ఇలా రోజుకు 20–30 సార్లు జరుగుతుందని లైన్‌మెన్‌లకు, సిబ్బందికి తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లూజ్‌లైన్‌ల కారణంగా గాలి దుమారానికి చెట్లకు ఆనుకొని కరెంటు వెంటనే పోతుందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారి మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ వైర్లకు చెట్లు కొమ్మలు ఉండడం వల్ల ఎర్తింగ్ ట్రిప్ అవుతుందన్నారు. రానున్న రోజుల్లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవియాదవ్, వార్డు సభ్యులు మాల యాదయ్య, గ్రామస్తులు జల్లాల మల్లేష్, బుర్రకాయల రమేష్, సుధాకర్, గిరి, శ్రీనివాస్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి రూ.6 లక్షలు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కొందుర్గు: పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ప్రస్తుతం గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం కింద రూ.6 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు చిన్నయ్య, బాలమ్మ, అనంతమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.